క్లుప్తంగా

ఎస్‌హెచ్‌ఓగా ట్రెయినీ ఐపీఎస్



నర్సంపేట రూరల్ : స్థానిక పోలీస్‌స్టేషన్‌లో స్టేషన్ హౌజ్ ఆఫీసర్ (ఎస్‌హెచ్‌ఓ)గా ట్రెయినీ ఐపీఎస్ అధికారి మనన్ భట్ గురువారం చేరారు. ఈ సందర్భంగా ఆయనకు ఏసీపీ కిరణ్‌కుమార్, సీఐ రమణమూర్తి పూలబొకే అందించి స్వాగతం పలికారు. ఐపీఎస్ శిక్షణలో భాగంగా ఎస్‌హెచ్‌ఓ విధులు అధ్యయనం చేసేందుకు మనన్ వచ్చినట్లు అధికారులు చెప్పారు. కార్యక్రమంలో ఎస్సై రవికుమార్, అరుణ్, సిబ్బంది పాల్గొన్నారు.

ఆధార్ కేంద్రం ఏర్పాటు

వర్ధన్నపేట : పట్టణంలోని పోస్టాఫీస్‌లో గురువారం ఆధార్ సేవా కేంద్రం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆ శాఖ డివిజన్ అధికారి సైదులు నాయక్ మాట్లాడారు. కొత్తగా ఆధార్ కార్డు నమోదు, ఆధార్ కార్డులో మార్పులు, సవరణ, తదితర సేవలు అందుతాయని చెప్పారు. పట్టణ ప్రజలు ఆధార్ కేంద్రాన్ని వినియోగించుకోవాలని కోరారు.

'యూత్ కాంగ్రెస్ కమిటీల రద్దు'



సంగెం : పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి ఆదేశాల మేరకు మండలంలోని యూత్ కాంగ్రెస్ కమిటీలను రద్దు చేసినట్లు యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గుగులోత్ రమేశ్ నాయక్ తెలిపారు. మండల కేంద్రంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. సంక్రాంతి పండుగలోగా నూతన కమిటీలను నియమిస్తామని తెలిపారు. పాత పదవులను ఎవరు కూడా వాడుకోవద్దని సూచించారు. ప్రొటోకాల్ పాటించకుండా ఫ్లెక్సీలు ఏర్పాటు చేయొద్దని, కార్యక్రమాలు నిర్వహించొద్దని కోరారు. సమావేశంలో యూత్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు ఆగపాటి రాజు, నాయకులు దామెరుప్పుల వీరేశ్, గుండేటి శ్రీకర్, ఆగపాటి రామకృష్ణ, ఎడ్ల చందు, రాకేశ్ తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో చదివితే మెరుగైన ఫలితాలు



పర్వతగిరి : క్రమశిక్షణతో చదివితే మెరుగైన ఫలితాలు వస్తాయని తహసీల్దార్ వెంకటస్వామి తెలిపారు. మండల కేంద్రంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ రెసిడెన్షియల్ స్కూల్ విద్యార్థినులకు గురువారం ఆయన జేఈఈ మెయిన్స్, అడ్వాన్స్‌డ్ పరీక్షల స్టడీ మెటీరియల్ అందజేసి మాట్లాడారు. మెటీరియల్‌ను వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు అపర్ణ, జూనియర్ లెక్చరర్లు జ్యోత్స్న, ప్రవళిక, పూజ, ఉపాధ్యాయులు రజని, కవిత, లైబ్రేరియన్ వీణ, తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులో వరి విత్తనాలు

ఖానాపురం : వరి విత్తనాలు అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయ అధికారి (ఏఓ) బోగ శ్రీనివాస్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్ఎఫ్ఎస్ఎం కింద కేఎన్ఎం-118 రకం సర్టిఫైడ్ సీడ్ రాయితీపై అందించనున్నట్లు పేర్కొన్నారు. సబ్సిడీ పోగా 25 కిలోల బస్తాకు రూ.500 చెల్లించి తీసుకోవాలని సూచించారు. ఆసక్తి కలిగిన రైతులు పట్టాదారు పాస్ పుస్తకం, ఆధార్ కార్డు, సెల్ నంబర్‌తో రైతు వేదికలో అధికారులను సంప్రదించాలని కోరారు.

పరామర్శ



వర్ధన్నపేట : స్థానిక మాజీ వైస్ ఎంపీపీ చొప్పరి సోమలక్ష్మి అనారోగ్యంతో వరంగల్‌లోని ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా ఆమెను మాజీ ఎమ్మెల్యే అరూరి రమేశ్ గురువారం పరామర్శించారు. అనారోగ్యంపై అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను కోరారు. ఆయన వెంట నాయకులు ఊకంటి వనంరెడ్డి, కొయ్యడ రాజు తదితరులున్నారు.

ఆర్థికసాయం

పర్వతగిరి : మండల కేంద్రానికి చెందిన సెంట్రింగ్ కార్మికుడు మహ్మద్ అలీ ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబానికి సెంట్రింగ్, మిల్లర్ కార్మికులు గురువారం రూ.10 వేల సాయం అందజేశారు. తొలుత మహ్మద్ అలీ చిత్రపటానికి నివాళులర్పించారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. 02డబ్ల్యూడిపిటి152-330056-బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందజేస్తున్న కార్మికులు

బ్రిడ్జిల నిర్మాణం కలేనా?

- శంకుస్థాపనలకే పరిమితం
- రైతులకు తప్పని తిప్పలు



రంగాపురం శివారులో బ్రిడ్జి నిర్మించాల్సిన పాకాల వాగు ప్రాంతం

ఖానాపురం : మండలంలోని రంగాపురం, ధర్మరావుపేట గ్రామ శివార్లల్లోని పాకాల వాగుపై బ్రిడ్జిలు నిర్మిస్తే ఇబ్బందులు రెండు మండలాల రైతులు, ప్రజల తొలిగిపోతాయి. రవాణా సదుపాయం సైతం మెరుగవుతుంది. బ్రిడ్జిల నిర్మాణానికి గత ప్రభుత్వం నిధులు మంజూరు చేయగా నాటి ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి శంకుస్థాపన సైతం చేశారు. కాగా ప్రభుత్వం మారడంతో బ్రిడ్జిల నిర్మాణం పెండింగ్‌లో పడిపోయింది. నిధులు హోల్డ్‌లో పడిపోయినట్లు సమాచారం. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఏడాది గడచినా నిర్మాణాలు చేపట్టకపోవడంపై ప్రజల్లో అసహనం వ్యక్తం అవుతోంది. ఇకనైనా ఎమ్మెల్యే, ఉన్నతాధికారులు స్పందించి బ్రిడ్జిల నిర్మాణ పనులు మొదలుపెట్టించాలని ప్రజలు కోరుతున్నారు.

మండలంలోని రంగాపురం, ధర్మరావుపేట గ్రామ శివారుల్లోని పాకాల వాగుపై బ్రిడ్జిల గత ప్రభుత్వం పంచాయతీరాజ్ శాఖ నుంచి నిధులు మంజూరు చేసింది. టెండరు ప్రక్రియ సైతం పూర్తి కావడంతో గతంలోనే బ్రిడ్జిల నిర్మాణానికి గతేడాది అక్టోబర్‌లో శంకుస్థాపన చేశారు. బ్రిడ్జి నిర్మిస్తే ఖానాపురం, చెన్నారావుపేట మండలాల రైతులు కేసముద్రం, నెక్కొండ మండలాలకు రాకపోకలు సాగించడం సులభమవుతుంది. వాగుకు రెండు వైపుల రెండు మండలాలకు చెందిన రైతుల వ్యవసాయ భూములు ఉండటంతో సంబంధిత రైతులు సుదూర ప్రాంతాల నుంచి రవాణా సాగించాల్సిన దుస్థితి నెలకొంది. బ్రిడ్జిలు నిర్మిస్తే పంట పొలాలకు వెళ్లడానికి, రావడానికి సదుపాయం కలుగుతుంది. మరోసారి నిధులు మంజూరి చేయాలని, బ్రిడ్జిల నిర్మాణాలు తప్పనిసరి అని ప్రస్తుత ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి ఆధ్వర్యంలో ప్రభుత్వానికి ఉన్నతాధికారులు మరోసారి ప్రతిపాదన పంపినట్లు తెలిసింది. అయితే నిధులు మంజూరైతే నిర్మాణాలు చేపట్టే అవకాశం ఉంది.

రాకపోకలు సులువవుతాయి

పాకాల వాగుపై బ్రిడ్జి నిర్మిస్తే రాకపోకలు సులువవుతాయి. రైతులకు, ప్రజలకు రవాణా కష్టాలు తొలగుతాయి. రైతులు పంట పొలాలకు వెళ్లడానికి, తిరిగి రావడానికి ఇబ్బంది లేకుండా ఉంటుంది. రైతులు, ప్రజలు కేసముద్రం, నెక్కొండ, మహబూబాబాద్ ప్రాంతాలకు వెళ్లడానికి అనువుగా ఉంటుంది. ప్రభుత్వం, అధికారులు స్పందించి బ్రిడ్జిల నిర్మాణం చేపట్టాలి.

- బంధారపు శ్రీనివాస్, రైతు, రంగాపురం

ప్రభుత్వానికి నివేదించాం

బ్రిడ్జిల నిర్మాణానికి గతంలో నిధులు మంజూరయ్యాయి. ప్రభుత్వం మారిన తర్వాత నిధులు హోల్డ్‌లో పెట్టారు. రైతులు, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్య పరిష్కరించేలా నిధులు కేటాయించాలని ఎమ్మెల్యే మాధవరెడ్డి ఆధ్వర్యంలో ప్రభుత్వానికి మరోసారి నివేదికలు పంపించాము. నిధులు మంజూరైతే వెంటనే బ్రిడ్జిల నిర్మాణ పనులు ప్రారంభించే అవకాశం ఉంటుంది.

- మణితేజరెడ్డి, ఏఈ, పీఆర్

ఘనంగా 24వ మండల పూజలు

- ఆలయ కమిటీ చైర్మన్ మాధవ శంకర్ గుప్తా



సమావేశంలో మాట్లాడుతున్న మాధవ శంకర్

నర్సంపేట : పట్టణంలోని శ్రీధర్మశాస్తా అయ్యప్ప స్వామి ఆలయంలో 24వ మండల పూజా మహోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ఆవరణలో గురువారం మీడియాతో ఆలయ కమిటీ చైర్మన్ శింగిరికొండ మాధవ శంకర్ గుప్తా మాట్లాడారు. నవంబర్ 14 నుంచి డిసెంబర్ 26 వరకు అయ్యప్ప స్వాములు, భక్తులకు మహా అన్నదాన ప్రసాద వితరణ, 14న పడిపూజలు, పల్లివేట, పంబారట్టు, గురుపౌర్ణమి, సత్యనారాయణస్వామి వ్రతం, డిసెంబర్ 21న సూర్య యాగం, జనవరి 1న నూతన సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించినట్లు తెలిపారు. అర్చకులు, గురుస్వాములు శ్రీవెంకటేశ్‌శర్మ, పద్మనాభన్ నంబూద్రి, భద్రకాళి ఆలయ అర్చకుడు రామకృష్ణ, ఆలయ నిత్య అర్చకులు దేవేష్ మిశ్రా అభిషేక పూజలు నిర్వహించారని వివరించారు. మండల పూజల విజయవంతానికి కృషి చేశారంటూ కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు సురేశ్, ప్రధాన కార్యదర్శి చింతల కమలాకర్‌రెడ్డి, కోశాధికారి రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

డీటీఎఫ్ కమిటీ ఎన్నిక



రఘువీర్



గోవర్ధన్

నల్లబెల్లి : డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ (డీటీఎఫ్) జిల్లా ఎన్నికల అధికారి కొమ్మాలు, రాష్ట్ర ఎన్నికల పరిశీలకుడు మహేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో మండల కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా కొమ్మాలు, మహేందర్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో వివరాలు వెల్లడించారు. మండల అధ్యక్షుడిగా తూముల రఘువీర్, ఉపాధ్యక్షులుగా పి.రవి, జి.ముంజుల, ప్రధాన కార్యదర్శిగా కందుల గోవర్ధన్, సహాయ కార్యదర్శులుగా నటరాజ్, నర్సింహ, కైలాసం, జిల్లా కౌన్సిలర్లుగా మహేందర్‌రెడ్డి, అరుణాదేవి, ఆడిట్ కమిటీ సభ్యులుగా చందర్, ప్రశాంత్, మనోహరస్వామి ఎన్నికైనట్లు తెలిపారు.

'నూతన' డైరీలు, క్యాలెండర్ల ఆవిష్కరణ



నర్సంపేట రూరల్ : డీటీఎఫ్ క్యాలెండర్, డైరీలను ఆవిష్కరిస్తున్న ఎంఈఓ, తదితరులు

సాక్షి నెట్‌వర్క్ : నర్సంపేట, వర్ధన్నపేట, నెక్కొండ, గీసుకొండ, దుగ్గొండి, ఖానాపురం తదితర మండలాల్లో నూతన సంవత్సర డైరీలను, క్యాలెండర్లను గురువారం ఆవిష్కరించారు. నర్సంపేట, నెక్కొండ, ఖానాపురం మండలాల్లో డీటీఎఫ్ డైరీలను, క్యాలెండర్లను ఎంఈఓ కొర్ర సారయ్య, ఫెడరేషన్ రాష్ట్ర కౌన్సిలర్ బానోతు జాన్ నాయక్, జిల్లా ప్రధాన కార్యదర్శి యాకయ్య వేర్వేరుగా ఆవిష్కరించారు. అలాగే పోలీస్‌స్టేషన్‌లో పవన్ కల్యాణ్ అభిమాన సంఘం అధ్యక్షుడు కొండేటి శ్రీకాంత్ ఆధ్వర్యంలో నూతన సంవత్సర క్యాలెండర్‌ను సీఐ శ్రీనివాసరావు, ఎస్సై మెరుగు రాజు ఆవిష్కరించారు. దుగ్గొండిలోని ప్రభుత్వ హైస్కూల్‌లో పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు పోలోజు భిక్షపతి ఆ యూనియన్ క్యాలెండర్‌ను, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో యూపీహెచ్‌సీ ఉద్యోగ సంఘం క్యాలెండర్‌ను డీఎంహెచ్‌ఓ డాక్టర్ సాంబశివరావు ఆవిష్కరించారు.

రాష్ట్రస్థాయి పోటీలో విద్యార్థులు

రాయపర్తి : సీఎం కప్ రాష్ట్రస్థాయి స్విమ్మింగ్ పోటీల్లో మండలంలోని కాట్రపల్లి ప్రభుత్వ హైస్కూల్ విద్యార్థులు రంజిత్‌కుమార్, ఇలియాజ్, తాహెర్ పాల్గొన్నట్లు పీఈటీ పుట్ట సమ్మయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాస్థాయి స్విమ్మింగ్ పోటీలో గోల్డ్ మెడల్ సాధించి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు పేర్కొన్నారు. గత నెల 31 నుంచి గురువారం వరకు హైదరాబాద్‌లో జరిగిన పోటీల్లో రంజిత్, ఇలియాజ్, తాహెర్ పాల్గొన్నట్లు వివరించారు.

'ఫ్లెక్సీల ఏర్పాటుపై చర్యలు తీసుకోవాలి'



సంగెం : గ్రామపంచాయతీ తీర్మానానికి వ్యతిరేకంగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ జాగృతి జిల్లా అధ్యక్షుడు యార బాలకృష్ణ నాయబ్ తహసీల్దార్ శ్రీనివాస్‌కు గురువారం ఫిర్యాదు చేశాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాజకీయ పార్టీలు గ్రామంలో ఫ్లెక్సీలు ఏర్పాటు చేయొద్దని అఖిలపక్ష నాయకులు గ్రామ ప్రత్యేక అధికారి, తహసీల్దార్ రాజ్‌కుమార్ సమక్షంలో గతేడాది తీర్మానం చేసినట్లు తెలిపారు. ఆ తీర్మానాన్ని ఉల్లంఘిస్తూ అధికార పార్టీ నాయకులు ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారని చెప్పారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ యూత్ విభాగం అధ్యక్షుడు పెండ్లి పురుషోత్తం, నాయకులు బొమ్మాల శంకర్, పోశాల ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

సామాజిక సేవలే 'వాసవి' ధ్యేయం

- క్లబ్ మాజీ గవర్నర్ సాంబమూర్తి



విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న సాంబమూర్తి, తదితరులు

గీసుకొండ : సామాజిక సేవలు నిర్వహించడమే వాసవి క్లబ్ ధ్యేయమని మాజీ గవర్నర్ గంపా సాంబమూర్తి తెలిపారు. మండలంలోని ధర్మారం ప్రభుత్వ ప్రాథమిక స్కూల్‌లో ఆ క్లబ్ కాశిబుగ్గ, వరంగల్ శాఖల సంయుక్త ఆధ్వర్యంలో మహాత్మ గాంధీ, జ్ఞాన సరస్వతి విగ్రహాలను సాంబమూర్తి ముఖ్యఅతిథిగా హాజరై ఆవిష్కరించి మాట్లాడారు. మహాత్మ గాంధీ లాంటి మహనీయుల, జ్ఞాన సరస్వతి వంటి దేవతల చరిత్రలను విద్యార్థులకు గుర్తు చేసేలా విగ్రహాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. క్లబ్ ఆధ్వర్యంలో పాఠశాలల్లో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్ సుంకరి మనీషా శివకుమార్, హెచ్ఎం సురేఖ, క్లబ్ వాసవీ వనిత క్లబ్‌ల అధ్యక్షులు డాక్టర్ పుల్లూరి సంపత్‌కుమార్, పుల్లూరి సుమతి, పూర్వ గవర్నర్ రవ్వ గీత, భవానీ, కోశాధికారి రమేశ్, మాజీ ఎంపీటీసీ మాడిశెట్టి రాజయ్య, తదితరులు పాల్గొన్నారు.

కూలి పెంపుపై నిర్లక్ష్యం సరికాదు

- సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు రమేశ్



వినతిపత్రం ఇస్తున్న రమేశ్, నాయకులు

నర్సంపేట : సివిల్ సప్లయిస్ హమాలీల కూలి పెంపు పట్ల ప్రభుత్వం, కార్మిక శాఖ కమిషనర్ నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు పంజాల రమేశ్ అన్నారు. పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయం ఎదుట సివిల్ సప్లయిస్ హమాలీ యూనియన్ (ఏఐటీయూసీ అనుబంధం) ఆధ్వర్యంలో గురువారం ధర్నా నిర్వహించారు. అనంతరం ఆర్డీఓ కార్యాలయ సూపరింటెండెంట్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రమేశ్ మాట్లాడారు. సివిల్ సప్లయిస్ హమాలీలకు ఇచ్చిన హామీలను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయకుండా మోసపూరితంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. కూలీ పెంపు జీఓ విడుదల చేయకుండా కార్మికులకు తీరని అన్యాయం చేస్తున్నారని ఆందోళన వెలిబుచ్చారు. సమ్మె చేస్తామని నోటీసు ఇచ్చినా ప్రభుత్వం, కార్మిక శాఖ కమిషనర్ స్పందించడం లేదన్నారు. ఇకనైనా ప్రభుత్వం స్పందించి హమలీల కూలీ పెంపు జీఓ విడుదల చేయడంతోపాటు ఇతర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీసీ హక్కుల సాధన సమితి జిల్లా కార్యదర్శి చింతకింది కుమారస్వామి, సివిల్ సప్లయిస్ హమాలీ యూనియన్ నాయకులు నర్సింగం, కిశోర్, మిట్టపల్లి మహేందర్, మాట్ల రవి, కుమారస్వామి, ముద్రబోయిన మహేందర్, మల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసంఘాల మద్దతు

వర్ధన్నపేట : కూలీ రేట్ల పెంపు జీఓ విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ వర్ధన్నపేట పట్టణంలోని ఎంఎల్ఎస్ పాయింట్ వద్ద సివిల్ సప్లయిస్ హమాలీలు చేపట్టిన సమ్మెకు ప్రజా సంఘాలు మద్దతు పలికాయి. తెలంగాణ అంబేడ్కర్ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జన్ను నర్సయ్య, రెవల్యూషనరీ సోషలిస్టు పార్టీ జిల్లా కార్యదర్శి వల్లందాసు కుమార్ సమ్మె శిబిరాన్ని గురువారం సందర్శించి సంఘీభావం తెలిపారు. సివిల్ సప్లయిస్ హమాలీల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ప్రజాసంఘాల ఆధ్వర్యంలో మరింత పెద్దఎత్తున ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు మరుపట్ల అంజయ్య, జంగిలి భాస్కర్, జలగం భిక్షపతి, జలగం మోహన్, కొండేటి శ్రీను, జి.రవి, వై.భుజంగం, జి.సామేలు, బి.ప్రకాశం, జి.సుమన్, కె.సంపత్, జి.వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

గడ్డివామి దగ్ధం



రాయపర్తి : ప్రమాదవశాత్తు నిప్పంటుకొని గడ్డివామి దగ్ధమైన ఘటన మండల కేంద్రంలో గురువారం చోటు చేసుకుంది. వివరాలిలా.. మండల కేంద్రానికి చెందిన మేకల పద్మ ఏర్పాటు చేసుకున్న 500 మోపుల గడ్డివామి ప్రమాదవశాత్తు నిప్పంటుకుని దగ్ధమైంది.

చికిత్స పొందుతున్న యువకుడి మృతి

నెక్కొండ : చికిత్స పొందుతున్న యువకుడు మృతి చెందిన ఘటన మండలంలోని వెంకటాపురంలో చోటు చేసుకుంది. వివరాలిలా.. వెంకటాపురం గ్రామానికి చెందిన ఒర్రె సహదేవుడు (30) ఈనెల 1న ప్రమాదవశాత్తు ఆటో నుంచి పడి తీవ్ర గాయాల పాలయ్యాడు. ఆయన వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి గురువారం మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

వర్ధన్నపేట : రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలైన ఘటన వర్ధన్నపేట పట్టణ శివారులో గురువారం చోటుచేసుకుంది. దమ్మన్నపేట ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడు మేకల సదయ్య, పట్టణానికి చెందిన బక్కతట్ల ప్రశాంత్‌లకు చెందిన బైక్‌లు మూలమలుపు వద్ద ఒకదానిని మరొకటి ఢీకొన్నాయి. ఇద్దరికీ గాయాలయ్యాయి. ఎస్సై మెరుగు రాజు ఘటనా స్థలికి చేరుకుని క్షతగాత్రులను వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు.

విద్యా సామర్థ్యాల పెంపునకు ప్రాధాన్యం

- అకడమిక్ మానిటరింగ్ అధికారి సుజన్ తేజ



విద్యార్థులతో మాట్లాడుతున్న సుజన్ తేజ

నర్సంపేట రూరల్ : విద్యార్థుల్లో విద్యాపరమైన సామర్థ్యాలను పెంపునకు ప్రాధాన్యత ఇవ్వాలని ఉపాధ్యాయులకు జిల్లా అకడమిక్ మానిటరింగ్ అధికారి సుజన్‌తేజ కోరారు. నర్సంపేట మండలంలోని మహేశ్వరంలోని పట్టణ గురుకుల పాఠశాలను గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్కూల్ పరిసరాలను, రిజిస్టర్లను, వంట గదిని, వంటలను ప్రత్యక్షంగా పరిశీలించి సూచనలు చేశారు. విద్యార్థుల సామర్థ్యాలపై అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయులు విద్యార్థులను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ అవసరమైన సూచనలు, సలహాలు అందిస్తూ మెరుగైన ఫలితాలు సాధించే దిశగా ప్రోత్సహించాలని చెప్పారు. ఎఫ్ఏ-1, ఎఫ్ఏ-2, ఎఫ్ఏ-3 పరీక్షల్లో విద్యార్థులు సాధించిన గ్రేడ్‌లను ఆన్‌లైన్‌లో నమోదు చేయడాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని తెలిపారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందేలా పర్యవేక్షించాలని చెప్పారు. కార్యక్రమంలో ప్రత్యేక అధికారి ఇషాక్ అలీ, తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు మెరుగైన వైద్యం అందించాలి

- డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ ప్రకాశ్



రికార్డులు పరిశీలిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌ఓ

ఖానాపురం : ప్రభుత్వ ఆస్పత్రుల్లో గర్భిణులకు మెరుగైన సేవలు అందించాలని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ ప్రకాశ్ కోరారు. మండల కేంద్రంలోని పీహెచ్‌సీని గురువారం ఆయన తనిఖీ చేశారు. రికార్డులతోపాటు వ్యాధి నిరోధక టీకాల గదిలోని ఐఎల్ఆర్‌పీ, డీప్ ఫ్రిజ్, తదితరాలను పరిశీలించారు. అనంతరం వైద్యులు, సిబ్బందితో మాట్లాడారు. ఆస్పత్రిలో వైద్యులు, సిబ్బంది సమర్థవంతంగా విధులు నిర్వర్తించి ప్రసవాలను ప్రోత్సహించాలని సూచించారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే ఉత్తమ సేవలు అందుతాయన్న భావన కలిగేలా పని చేయాలని కోరారు. గర్భిణులకు ఎప్పటికప్పుడు వైద్యపరీక్షలు నిర్వహించాలని, బాలలకు సకాలంలో వ్యాధి నిరోధక టీకాలు వేయాలని, ప్రసవాల అనంతరం వైద్యపరీక్షల పట్ల అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. ఆరోగ్య మహిళా కార్యక్రమంలో నిర్లక్ష్యం ఉండొద్దన్నారు. జాతీయ ఆరోగ్య కార్యక్రమాలను నూరు శాతం విజయవంతం చేయాలని చెప్పారు. కార్యక్రమంలో వైద్యాధికారి జ్యోతి, సీహెచ్‌ఓ రాజయ్య, సిబ్బంది చిన్ని, దామోదర్‌రెడ్డి, దేవిక, సబిత, భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించేలా అభివృద్ధి పనులు



పనులను ప్రారంభిస్తున్న కౌన్సిలర్ కవిత



రెండో వార్డులో ప్రారంభిస్తున్న కౌన్సిలర్ రాజు

నర్సంపేట : సమస్యలు పరిష్కరించేలా అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు మూడో వార్డు కౌన్సిలర్ బానోతు కవిత వీరన్న తెలిపారు. పట్టణంలోని మూడో వార్డు పరిధిలో టీయూఎఫ్ఐడీసీ నిధులతో చేపట్టిన సీసీ రోడ్ల, సైడ్ కాల్వల పనులను గురువారం ఆమె ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ కమిటీ ప్రధాన కార్యదర్శులు రాజేందర్, గూడూరు సందీప్, ఉపాధ్యక్షులు విజయ్‌సింగ్, నాగేంద్రబాబు, శ్రీనివాస్, రామగిరి యాదగిరి, కృష్ణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

రెండో వార్డులో..

పట్టణంలోని రెండో వార్డులో మున్సిపల్ నిధులతో చేపట్టిన సీసీ రోడ్డు పనులను స్థానిక కౌన్సిలర్ జుర్రు రాజు యాదవ్ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడారు. ముత్తినేని వీరన్న ఇంటి నుంచి గనే సోమన్న ఇంటి వరకు, కపాటి నాగేందర్ ఇంటి నుంచి ముత్తినేని వీరన్న ఇంటి వరకు సీసీ రోడ్డు నిర్మించనున్నట్లు తెలిపారు. అలాగే అల్లం సాంబయ్య ఇంటి నుంచి నల్ల భారతి ఇంటి వరకు సైడ్ కాల్వ నిర్మాణం చేపడుతున్నట్లు చెప్పారు.

అవగాహనతోనే సైబర్ నేరాలకు చెక్

- మండల ప్రత్యేక అధికారి బాలకృష్ణ



సమావేశంలో మాట్లాడుతున్న బాలకృష్ణ

చెన్నారావుపేట : అవగాహనతోనే సైబర్ నేరాలకు చెక్ పెట్టగలమని మండల ప్రత్యేక అధికారి బాలకృష్ణ తెలిపారు. మండలంలోని లింగగిరిలో శ్రీ ధరణి స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) సహకారంతో గురువారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. సమాజంలో పలువురు అత్యాశతో ఆర్థిక నేరాల బారిన పడి మోసపోతున్నారని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న బీమా, ఇతర పథకాలను వినియోగించుకోవాలని సూచించారు. ఎస్‌బీఐ అధికారి వేణుగోపాల్ మాట్లాడుతూ బ్యాంకు ఖాతాదారులు సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని కోరారు. ఎవరైనా సైబర్ నేరాల బారిన పడితే వెంటనే టోల్‌ఫ్రీ నంబర్ 1930కి ఫిర్యాదు చేయాలని సూచించారు. సమావేశంలో ధరణి సేవా సంస్థ చైర్మన్ కల్లెపు శోభారాణి, యూడీఐ లీడ్ బ్యాంక్ ఎఫ్ఎల్‌సీ జిల్లా కౌన్సిలర్ భాస్కరాచారి, గ్రామ పంచాయతీ కార్యదర్శి శ్యాంప్రసాద్, సీసీ కిరణ్, హెడ్ మాస్టర్ కట్టస్వామి, సంస్థ ప్రతినిధులు దేవేంద్ర, భవానీ, పార్వతి, తదితరులు పాల్గొన్నారు.

వృద్ధాప్యంలో ఆరోగ్య పరిరక్షణ కీలకం

- పీహెచ్‌సీ వైద్యాధికారి సరోజ

చెన్నారావుపేట : వృద్ధాప్యంలో ఆరోగ్య పరిరక్షణ కీలకమని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి సరోజ తెలిపారు. మండల కేంద్రంలో వయోవృద్ధుల సంక్షేమ సంఘం మండల శాఖ ఆధ్వర్యంలో గురువారం ఏర్పాటు చేసిన వైద్యశిబిరంలో ఆమె పలువురికి వైద్యపరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. వయోవృద్ధులు తరచూ ఆరోగ్య సమస్యల బారిన పడే అవకాశాలు ఉన్నాయని చెప్పారు. వైద్యుల సలహాలు పాటిస్తూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. కాలానికి అనుగుణంగా అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. శిబిరంలో 88 మందికి వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు ఈగ సత్యనారాయణ, సీహెచ్‌ఓ భద్రయ్య, హెల్త్ సూపర్‌వైజర్ సువార్త, ఎంఎల్‌హెచ్‌పీ యమున, హెల్త్ అసిస్టెంట్లు సురేందర్, సార్య నాయక్, ఏఎన్ఎం పుష్పలత, ఆశ కార్యకర్తలు శ్రీలత, అనిత, మంజుల, తదితరులు పాల్గొన్నారు.

ఆయకట్టు కింద ఉత్సాహంగా వరినాట్లు



నాట్లు వేస్తున్న మహిళా రైతులు, కూలీలు

ఖానాపురం : ధాన్యాగార కేంద్రంగా పాకాల ప్రత్యేక గుర్తింపు పొందిన విషయం తెలిసిందే. పాకాల ఆయకట్టు కింద వరి పంటలు ఖరీఫ్‌తోపాటు రబీలోనూ సాగవుతుండడం పరిపాటి. ప్రస్తుతం పాకాల ఆయకట్టు కింద రబీకి నిర్ణయించారు. ఈ క్రమంలో బావుల కింద రైతులు నాట్లు మొదలుపెట్టారు. బావుల కింద నాట్లు వేసుకోవడంలో అన్నదాతలు నిమగ్నమయ్యారు. వరి నాట్లు వేయడానికి వచ్చిన మహిళా కూలీలు పాటలు పాడుతూ ఉత్సాహంగా నాట్లు వేస్తున్నారు. మండలంలోని మంగళవారిపేట శివారులో రైతులు పాటలు పాడుతూ నాట్లు వేశారు.